# గొలుసు దొంగ

అక్క పెళ్ళిసందట్లో తనకు మరీ ప్రాముఖ్యం తగ్గిపోవడంవల్ల రాధకు ఊసుపోక అందర్నీ హరీ షిస్తూ యింటి వెనుక పంచలో కూర్చుంది. ఆ ఇంట్లో మామూలు రోజుల్లోనే రైతులూ చుట్టాలూ అందరూ సందడిగా వుండడం అలవాటు. అందులోకీ పెళ్ళి! కాఫీల గదిలో కొందరూ, వీధిగదిలో చతుర్ముఖపురాణం వాళ్లు కొందఱు, ఎవరి సందట్లో వాళ్లు నిమగ్నులై వున్నారు. "ఏఁవమ్మా ఇక్కడ కూర్చున్నావు" అని అడిగింది పుల్లమ్మ. రాధ మాట్లాడలేదు. అసలు సమాధానం చెప్పదలచుకోలేదు. పుల్లమ్మత్తన్నా నర్సమ్మ అన్నా రాధకి అసహ్యం. వాళ్ళు తనని పలకరిస్తే మరీ కోపం. మూతి విరుచుకొని పుల్లమ్మ వెళ్ళిపోయింది. అలా రెండు నిమిషాలున్నదో యేమో "అన్నట్టు తమ్ముడేడీ" అనుకుంది రాధ. గబగబా యింట్లోకి వెళ్లింది. వీధిలోకి వచ్చింది. ఇంట్లోనూ వీధిలోనూ కనబడలేదు. గదులన్నీ వెదికింది. ఇంతట్లో సీత పిన్నిగారి రఘు చెప్పాడు. "ఇప్పుడే పుల్లమ్మత్త రమ్మన్నదనీ తమ్ముడు రానంటే బలవంతంగా యీడ్చుకెళ్ళిందనీ"ని. రాధ భయపడింది; పుల్లమ్మత్తా నర్సమ్మా కలసి తమ్ముణ్ణి ఏమైనా చేసేస్తారని. గబగబ పెరటివైపు నడిచింది. రాధకు ఒక్కసారి గుండె ఆగినంత పనయింది. తనూహించినట్టే ఇద్దరూ కలసి తమ్ముణ్ణి లాక్కుపోతున్నారు. నర్సమ్మ—తమ్ముడి చేతిలో బంతి లాక్కొని పంచలోకి విసిరేసింది. తమ్ముడు గట్టిగా ఏడవడం ఆరంభించాడు.

"ఎందుకురా అల్లా రాగాలీస్తావ్! ఊరల్లా వినాల్నా" అంటోంది పుల్లమ్మత్త "నీ బంతి ఎక్కడికీ పోదు. మా వెంటరా" అన్నది నర్సమ్మ.

"అన్నయ్యా వొడుక్కి వచ్చినప్పుడూ అక్కయ్య నెంత యేడిపించావూ! తర్వాత అక్కయ్య చెప్పింది కూడాను—వీళ్లు వెళ్లిపోయే అప్పుడు వీశెన్నర బంగళాదుంపలూ పంచదారా కాఫీగుండా కట్టుకుపోయేర్ట!" "దొంగముండలు" మెల్లగా అనుకుంది రాధ. రాధకి మరొక భయం పట్టుకుంది. "తమ్ముడి మెళ్లో చైను తీసుకుంటూరు కాబోలు" తమ్ముడేడుస్తున్నాడు "అమ్మా" అని. "ఎందుకురాఅమ్మ. నువ్వెంత అరిచినా ఇప్పుడు రాదులే" అంది పుల్లమ్మ. తమ్ముడెంత యేడుస్తున్నా లక్ష్యం చెయ్యకుండా నూతి దగ్గరకు తీసుకుపోతున్నారు. రాధకు మతిపోయింది. గడ్డివామి పక్క నిలబడి వింటోంది. నర్సమ్మా పుల్లమ్మత్తా ఏవో గుసగుసలాడుకుంటున్నారు. "ఇప్పటికే ఆలస్యమైంది. ఆ మెళ్లో చైను తియ్యావే" అంది నర్సమ్మ. తీశారు కాబోలు! తమ్ముడు గట్టిగా ఏడ్వడం రాధకు వినిపించింది. "బట్టలిప్పియ్యరా" అంది పుల్లమ్మత్త. రాధ కొంచెం తలయెత్తి చూసింది. పుల్లమ్మత్త అందించిన చైన్ని నర్సమ్మ కొంగుకు ముడి వేసుకుంది. తమ్ముణ్ణి నూతిగట్టు అవతలకు తీసుకువెళ్లారు. రాధకు గుండె జారిపోయింది.

అక్కడుంటే ఏం జరుగుతుందోనని ఇంట్లోకి పరుగెత్తి నాన్నగారి చెవిలో చెప్పింది. ఆయన ఉన్నపళంగా పరుగెత్తుకొచ్చారు. ఆయన వెంట చాలమంది వచ్చారు. నూతి వెనుక పుల్లమ్మత్తా నర్సమ్మా వంగి తమ్ముణ్ణి ఏదో చేస్తున్నారు. తమ్ముడు గట్టిగా "అమ్మా" అని ఏడుస్తున్నాడు. రాధా, వాళ్ల నాన్నా పరుగెత్తి వెళ్లారు. నర్సమ్మ తమ్ముడికి తలంటుతూంది. ఆ పక్కన బట్టలన్నీ పడివున్నాయి. "నరిరా నాయనా! అబ్బబ్బ తలంటి పోసుకోవడాని కెంత అల్లరి పెడ్తావురా! హాయిగా ఒళ్ళు తుడుచుకొని, తల దువ్వుకొని, చైను వేసుకొని ఆడుకుందుకుగాని" అన్నది—నర్సమ్మ. రాధ నాన్నగారు ఫక్కున నవ్వారు. రాధ అమాయికంగా చూసింది. ★


మనీస్ జమ్స్!

"How to speak & write correctly" Rs 2/- "Model Letter writer & Business Correspondence" Rs 1/8/- "Money's Dictionary (Eng-Eng-Telugu)" Rs 3/4

A S Money & Co, (AP)
14, Sambier Street, MADRAS-1.